క్లుప్తంగా

విజయ గణపతికి ప్రత్యేక పూజలు


విజయగణపతికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు

విజయనగరం రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం రామనారాయణంలో విజయగణపతికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. హస్తా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకులు చైతన్య, శ్రీహర్ష ఆధ్వర్యంలో విజయ గణపతికి పంచామృతాభిషేకాలు, స్నపనం, అర్చన చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీలు నారాయణం శ్రీనివాస్ దంపతులు, మేనేజర్లు శ్రీనివాసరాజు, ఎంవీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు రోటరీ చేయూత


దివ్యాంగ చిన్నారికి దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

విజయనగరం: దివ్యాంగులకు స్వచ్ఛంద సంస్థలు చేయూత నందించాలని రోటరీ సెంట్రల్ క్లబ్ అధ్యక్షుడు వీవీ రాజేష్ పిలుపునిచ్చారు. పట్టణంలోని కంటోన్మెంట్ సాలిపేటలో ఉన్న సారథి వెల్ఫేర్ అసోసియేషన్ వికలాంగ కేంద్రంలో ఉన్న 30 మంది అంధ మహిళా డిగ్రీ విద్యార్థినులకు రోటరీ సెంట్రల్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం దుస్తులతో పాటు 25 వేల రూపాయల నగదు అందజేశారు. కిరాణా సామగ్రి కోసం ప్రతినెలా పదివేల రూపాయలు అందజేస్తామన్నారు. అనంతరం మూగ విద్యార్థిని రాజేశ్వరి పుట్టినరోజు వేడుక నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు డాక్టర్ సునీత, డాక్టర్ కల్యాణ చక్రవర్తి, గ్రంధి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో భూసారం


దశపర్ని కషాయం తయారీపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయం అమకాం యూనిట్ ఇన్‌చార్జ్ ధనలక్ష్మి

డెంకాడ: ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు సాగు చేయడం వల్ల భూసారం పెరిగి అధిక దిగుబడులు వస్తాయని ప్రకృతి వ్యవసాయం అమకాం యూనిట్ ఇన్‌చార్జ్ పి. ధనలక్ష్మి అన్నారు. మండలంలోని అమకాం యూనిట్ పరిధిలోని చిట్టిగుంకలాంలో ఎస్‌హెచ్‌జీ మహిళల సమక్షంలో సోమవారం దశపర్ని కషాయం తయారుచేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రసాయన ఎరువులు, పురుగు మందులు వాడడం వల్ల పంటతో పాటు నేల కూడా కలుషితమవుతుందని తెలిపారు. దశపర్ని కషాయంతో చీడపీడల నుంచి పంటను రక్షించుకోవచ్చన్నారు.

మెడికల్ క్యాంప్‌లు నిర్వహించాలి

విజయనగరం పూల్‌బాగ్: జిల్లా వ్యాప్తంగా ఉన్న సంక్షేమ హాస్టల్ విద్యార్థులు కళ్ల కలకలతో బాధపడుతున్నారని, వెంటనే ఆయా వసతిగృహాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి. రామ్మోహనరావు కోరారు. ఈ మేరకు జేసీని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, హర్ష పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ అన్నపూర్ణ మృతి

విజయనగరం రూరల్: విజయనగరం మాజీ ఎంపీపీ సైలాడ అన్నపూర్ణ అనారోగ్యంతో సోమవారం ఉదయం మృతి చెందారు. కొద్ది కాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నారు. అన్నపూర్ణ విజయనగరం ఎంపీపీగా, మున్సిపల్ కౌన్సిలర్‌గా ప్రజలకు సేవలందించారు. ఆమె భర్త సైలాడ త్రినాథ్ విజయనగరం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా సేవలందించారు. ఆమె మృతికి పలువురు రాజకీయ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

అంగన్‌వాడీ భవనాల పరిశీలన


మండల కేంద్రంలో నిర్మాణంలో అంగన్‌వాడీ భవనాన్ని పరిశీలిస్తున్న అర్జేడీ జి.చిరణ్మయి

భోగాపురం: మండలంలోని ముక్కాం, రామచంద్రపేట, భోగాపురం పంచాయతీల్లో నూతనంగా నిర్మిస్తున్న అంగన్‌వాడీ భవనాలను విశాఖపట్నం డివిజన్ అర్జేడీ జి.చిరణ్మయి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ, విశాఖపట్నం డివిజన్‌కు సంబంధించి 534 నూతన అంగన్‌వాడీ భవనాలను నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఒక్కో భవన నిర్మాణానికి రూ. 16 లక్షలు చొప్పున.. అలాగే మరమ్మతులు చేపట్టాల్సిన 376 భవనాలకు గాను ఒక్కో భవనానికి రూ. 5 లక్షలు చొప్పున నిధులు మంజూరు చేసిందన్నారు. పరిశీలనలో ఆమె వెంట సీడీపీఓ ఎస్తేరురాణి, ఏసీడీపీఓ తవిటినాయుడు, సూపర్‌వైజర్ నాగమణి పాల్గొన్నారు.

టార్గెట్ అక్టోబర్

- అమ్మవారి జాతర నాటికి ట్యాంక్ బండ్ రోడ్ విస్తరణ పూర్తికి చర్యలు
- రూ.7 కోట్లతో ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో జరుగుతున్న పనులు
- 1.20 కిలోమీటర్ల మేర 120 అడుగుల వెడల్పుతో 6 లేన్‌లుగా విస్తరణ
- పనులు పర్యవేక్షించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల


పనులు పర్యవేక్షించి అధికారులకు సూచనలిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి (ఫైల్)

విజయనగరం: గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభించి చేయలేక చేతులెత్తేసిన అభివృద్ధి పనులను పూర్తి చేసే దిశగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు నగర అభివృద్ధే ధ్యేయంగా విజయనగరం కార్పొరేషన్ పరిధిలోని ప్రధాన రోడ్ల విస్తరణపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే నగరంలోని కలెక్టరేట్ జంక్షన్ నుంచి ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచి వరకు 66 అడుగులు ఉన్న 2 లేన్ల రోడ్డు మార్గాన్ని రూ.6.50 కోట్లతో 4 లేన్ల రోడ్డుగా విస్తరించే పనులు పూర్తి చేశారు. తాజాగా ట్యాంక్ బండ్ రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేసే దిశగా చర్యలు చేపడుతున్నారు. ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో జరుగుతున్న పనులు అక్టోబర్ నెలలో నిర్వహించే ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పైడితల్లమ్మ వారి జాతర మహోత్సవ సమయానికి పూర్తి చేసేలా ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేశారు. ఈ మేరకు ఆ మార్గంలో రహదారి విస్తరణ పనుల ప్రగతిని ఆర్‌అండ్‌బీ, విద్యుత్, కార్పొరేషన్ శాఖల అధికారులతో కలిసి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పర్యవేక్షించి పలు సూచనలు, సలహాలు చేశారు.

6 లేన్లగా విస్తరించనున్న ట్యాంక్ బండ్ రోడ్

నగరంలోని నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే బాలాజీ జంక్షన్ నుంచి మయూరి జంక్షన్‌కు వెళ్లే ట్యాంక్ బండ్ రోడ్ 1.2 కిలోమీటర్ల పొడవు ఉంటుంది. ఈ మార్గంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం 80 అడుగుల వెడల్పుతో ఉన్న 4 లేన్ల రోడ్డును 100 నుంచి 120 అడుగుల వెడల్పుతో 6 లేన్లగా విస్తరించనుంది. వాస్తవానికి ఈ పనులు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 2017 సంవత్సరంలో ప్రారంభించినప్పటికీ అప్పట్లో పాలకులు చేయలేక చేతులెత్తేశారు. ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో రూ.4.22 కోట్లతో అప్పట్లో ప్రారంభించిన పనులు భవనాల తొలగింపు, కొంత మార్గంలో కాలువ నిర్మాణంతో ఆగిపోయింది. పనులు సకాలంలో పూర్తికాకపోవటంతో కేటాయించిన నిధులు సైతం వెనక్కి మళ్లిపోయాయి. 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజల కష్టాలను గుర్తించి ప్రధాన రహదారుల విస్తరణ పనులపై దృష్టి సారించింది. వెనక్కి మళ్లిపోయిన నిధులు మరల కేటాయించేలా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులతో చేపట్టిన సంప్రదింపులు సఫలీకృతం కావటంతో మళ్లీ ఆ పనులు పునఃప్రారంభించటంతో పాటు పూర్తి చేసే దిశగా చర్యలు వేగవంతమయ్యాయి. ఇప్పటికే 600 మీటర్ల మేర కాలువ నిర్మాణ పూర్తి చేయగా... పైన ఉన్న పెద్ద చెరువు నుంచి దిగువ భాగంలోని ఖాళీ ప్రదేశంలోకి నీరు ప్రవహించేందుకు అవసరమైన నిర్మాణ పనులు పూర్తి చేశారు. రానున్న రెండు రోజుల్లో ఆ మార్గం వెంబడి ఉన్న సెంట్రల్ లైటింగ్ స్తంభాలను తొలగించే పనులు విద్యుత్ శాఖ అధికారులు ప్రారంభించనున్నారు. మొత్తం రూ.7 కోట్లతో ఈ పనులు చేపడుతుండగా... మయూరి జంక్షన్ నుంచి ఎల్ఐసీ కార్యాలయం వరకు ఒక భాగంగా... అక్కడి నుంచి బాలాజీ జంక్షన్ వరకు మరో భాగంగా విస్తరణ పనులు చేపట్టనున్నారు. ఈ పనులను మరో మూడు నెలల్లో పూర్తి చేసేలా చర్యలు వేగవంతం చేశారు.


విస్తరించనున్న మయూరి జంక్షన్ నుంచి బాలాజీ జంక్షన్‌కు వెళ్లే ట్యాంక్ బండ్ రోడ్

విస్తరణ పనులు పూర్తికి చర్యలు



జిల్లా కేంద్రంలోని మయూరి జంక్షన్ నుంచి బాలాజీ జంక్షన్ వరకు చేపడుతున్న రహదారి విస్తరణ పనులు పూర్తి చేసే దిశగా చర్యలు వేగవంతం చేశాం. మొత్తం రూ.7 కోట్లతో ఈ పనులు చేపడుతున్నాం. వెనక్కి మళ్లిన నిధులను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నేతృత్వంలో తిరిగి మంజూరు చేయించటంతో పనులు ప్రారంభించాం. అక్టోబర్‌లోగా పనులు పూర్తి చేసే కార్యాచరణ సిద్ధం చేశాం. రెండు రోజుల్లో ఆ మార్గంలో ఉన్న విద్యుత్ స్తంభాలను మార్పు చేస్తాం. – టి.శ్రీనివాసరావు, డీఈఈ, ఆర్‌అండ్‌బీ, విజయనగరం

విజయనగరంలో శరవేగంగా అభివృద్ధి

- 4వ డివిజన్‌లో రూ.20 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం
- శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల


శిలాఫలకం ఆవిష్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రత్యేక కృషితో ముందెన్నడూ లేనివిధంగా నగరంలో అభివృద్ధి సాగుతోందని నగర ఫ్లోర్‌లీడర్ ఎస్‌వీవీ రాజేష్, కార్పొరేటర్ మారోజు శ్రీను అన్నారు. నగరంలోని 4వ డివిజన్ పరిధి విజయలక్ష్మినగర్, మంగలవీధి కాలనీ ప్రాంతాల్లో సుమారు రూ.20 లక్షల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు సోమవారం కోలగట్ల వీరభద్రస్వామి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం ఇక్కడ రహదారులు, కాలువల నిర్మాణంతో పాటు పాదాలమ్మ ఆలయ ప్రాంగణంలో చదును పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. స్థానిక ప్రజల అవసరార్థం సామాజిక భవనాన్ని సైతం కోలగట్ల మంజూరు చేయించారని గుర్తు చేశారు. నగరంలో తాగునీటి సమస్య లేకుండా చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఆశయ సాధనలో భాగంగా నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమ ప్రాధాన్యంతో కోలగట్ల అమలు చేస్తున్నారని వివరించారు. పేద ప్రజల ఆకలిని తీర్చేందుకు నగరంలోని ఆరు ఫుడ్ బ్యాంకులు ఏర్పాటు చేశారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లోనూ కోలగట్లను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ ముచ్చు లయాయాదవ్, జోనల్ ఇన్‌చార్జ్‌లు ముచ్చు శ్రీనుయాదవ్, ముద్దాడ మధు, పలు విభాగాల సిబ్బంది, డివిజన్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పశు అంబులెన్స్ సేవలు వినియోగించుకోండి..


మాట్లాడుతున్న జిల్లా పశువిజ్ఞాన బడి ఉప సంచాలకుడు వై.వెంకటరమణ

భోగాపురం: అత్యవసర సమయాల్లో టోల్‌ఫ్రీ నంబర్ 1962 ద్వారా ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పశు అంబులెన్స్ సేవలను ఉపయోగించుకోవాలని జిల్లా పశు విజ్ఞానబడి ఉప సంచాలకుడు డాక్టర్ వై.వెంకటరమణ పాడి రైతులకు సూచించారు. మండలంలోని నందిగాం రైతుభరోసా కేంద్రంలో సోమవారం నిర్వహించిన పశు విజ్ఞానబడి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, పశుకిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా రుణం పొందాలన్నా, సబ్సిడీపై సంపూర్ణ మిశ్రమ దాణా పొందాలన్నా రైతుభరోసా కేంద్రాలను సంప్రదించాలన్నారు. ఆర్‌బీకేలో ఉన్న పశు సంవర్థక సహాయకుడి ద్వారా అందుతున్న సేవలపై రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం భోగాపురం, బాకివలస రైతుభరోసా కేంద్రాలతో పాటు స్థానిక పశువైద్యశాలను సందర్శించి, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భోగాపురం ఏరియా పశు వైద్య సహాయ సంచాలకుడు డాక్టర్ ఉమాశంకర్ మహాపాత్రో, ముంజేరు పశువైద్యాధికారి యు.రామరాజు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరాకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టండి

విజయనగరం అర్బన్: గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణం కారణంగా గంట్యాడ మండలం కొండతామరపల్లి గ్రామ పరిధిలోని 'బాపన బంద' చెరువుకు తాటిపూడి జలాశయ నీటి సరఫరా జరగడం లేదని ఆయకట్టు రైతులు చెబుతున్నారు. బాపనబంద కింద ఉన్న ఆయకట్టుకు నీరందించేందుకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఈమేరకు కలెక్టర్ నాగలక్ష్మిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు.

నవధాన్యాల సాగుతో అధిక దిగుబడులు

- ఎంపీపీ కల్యాణి


నవధాన్యాలు సాగు కిట్లు అందజేస్తున్న ఎంపీపీ కల్యాణి, తదితరులు

పూసపాటిరేగ: నవధాన్యాల సాగుతో అధిక దిగుబడులు వస్తాయని ఎంపీపీ మహంతి కల్యాణి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాయలంలో ఎస్సీ కార్పొరేషన్, ప్రకృతి వ్యవసాయశాఖల సమన్వయంతో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న షెడ్యూల్ కులాల రైతులకు నవధాన్యాల సాగు కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, షెడ్యూల్ కులాలు రైతులకు పదివేల రూపాయల విలువచేసే విత్తనాలు, ప్రకృతి వ్యవసాయానికి పనికివచ్చే ఉపకరణాలు అందజేస్తారని చెప్పారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా జిల్లాలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న 236 మంది రైతులను గుర్తించి విత్తనాలు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి. రామారావు, జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, ఎస్సీ కార్పొరేషన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కేఎన్ ప్రభాకర్, ఏఓ బి. నాయుడుబాబు, ఐసీఆర్‌పీ దుర్గతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

సుభాష్ పత్రీజీ బోధనలు స్ఫూర్తిదాయకం


గౌతమ్ గురూజీని సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయనగరం: పిరమిడ్ సొసైటీ వ్యవస్థాపకుడు దివంగత సుభాష్ పత్రీజీ బోధనలు సమాజానికి స్ఫూర్తిదాయకమని సీనియర్ పిరమిడ్ మాస్టర్ గౌతమ్ గురూజీ అన్నారు. పట్టణంలోని కేఎల్ పురంలో గల ప్రైవేట్ కల్యాణ మంటపంలో సుభాష్ పత్రీజీ ప్రథమ స్మృతి మహోత్సవం (సంస్మరణ సభ) సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గౌతమ్ గురూజీ మాట్లాడుతూ, సుభాష్ పత్రీజీ ధ్యానం యొక్క విశిష్టతను, శాఖాహారం ప్రాముఖ్యతను తెలియజేపి సమాజాన్ని సన్మార్గంలో నడిపారన్నారు. పత్రీజీ నిర్దేశించిన బాటలో ప్రతిఒక్కరూ పయనించడమే ఆయనకు మనం ఇచ్చే ఘన నివాళి అని తెలిపారు. పిరమిడ్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు జె. రామారావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో గౌతమ్ గురూజీని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, జ్ఞానేశ్వర్, శశిభూషణ్ గురూజీ, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి


నిరసన దీక్షా శిబిరంలో విద్యార్థులు

విజయనగరం పూల్‌బాగ్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ వెంకటేష్, పి. రామ్మోహన్ మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయడం లేదన్నారు. కనీసం పాఠ్య పుస్తకాలు కూడా అందించడం లేదని .. అధ్యాపకుల పోస్టులు కూడా భర్తీ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించని ఎడల ఆందోళనలను ఉధృతం చేస్తామని చెప్పారు. దీక్షా శిబిరాన్ని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సురేష్, ఐద్వా పట్టణ కార్యదర్శి లక్ష్మి, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ హరీష్, ఇతర ప్రజా సంఘాల నాయకులు సందర్శించి మద్దతు తెలిపారు. నిరసన దీక్షలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నందిగాంలో 'స్వచ్ఛభారత్' భేష్

- కేంద్ర స్వచ్ఛభారత్ మిషన్ కన్సల్టెంట్ సాక్షి శ్రీవాత్సవ


నందిగాంలోని చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న కేంద్ర స్వచ్ఛభారత్ మిషన్ కన్సల్టెంట్ సాక్షి శ్రీవాత్సవ

భోగాపురం: మండలంలోని నందిగాం గ్రామ పంచాయతీలో నిర్వహిస్తున్న స్వచ్ఛభారత్ మిషన్, గ్రామీణ కార్యక్రమాల నిర్వహణ భేషుగ్గా ఉందని కేంద్ర స్వచ్ఛభారత్ మిషన్ ఐఈసీ కన్సల్టెంట్ సాక్షి శ్రీవాత్సవ అన్నారు. నందిగాం గ్రామంలోని పంచాయతీ కార్యాలయం, అమృత్ సరోవర్ చెరువు, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను సోమవారం ఆమె సందర్శించారు. పచ్చదనంతో నిండిన పంచాయతీ కార్యాలయాన్ని చూసి సర్పంచ్ గరే మురళీమోహనరావుతో పాటు సచివాలయ సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో డీపీఓ ఎల్ఎన్‌వీ శ్రీధర్‌రాజా, ఆర్‌డబ్ల్యూఎస్ఈఈ బి.ఉమాశంకర్, డీఈఈ బీవీ కోటేశ్వరరావు, ఎంపీడీఓ అప్పలనాయుడు, ఈఓపీఆర్‌డీ సురేష్, డీఈఈ వైకుంఠనాయుడు, పంచాయతీ కార్యదర్శి ఎస్.శ్రీనివాస్‌కుమార్, ఏఈ హేమంత్, సుధాకర్, రమేష్, శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రామాచార్యులకు జ్యోతిషరత్న బిరుదు


రామాచార్యులను సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయనగరం టౌన్: పట్టణంలోని దాసన్నపేటలో కొలువైన చిన్న ఆంజనేయస్వామి దేవస్థానం ప్రధాన అర్చకుడు బ్రహ్మశ్రీ ఆరవెల్లి రామాచార్యులకు జ్యోతిష్య రత్న బిరుదు వరించింది. విశాఖలో ఆదివారం రాత్రి నిర్వహించిన వైదిక జ్యోతిష్య సమ్మేళనంలో జ్యోతిష్య పురోహిత అర్చక రంగంలో విశేష కృషిచేస్తున్నందుకు గాను రామాచార్యులను దుశ్శాలువ, జ్ఞాపికతో నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. టీటీడీ ప్రధాన అర్చకుడు వేణుగోపాల దీక్షితులు చేతుల మీదుగా సత్కారం అందుకోవడం ఆనందంగా ఉందని రామాచార్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

భవిష్యత్ తరాలకు భరోసా 'సీఎం జగన్'

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు
- పల్లెల్లో ఉత్సాహంగా గడప గడపకు మన ప్రభుత్వం
- ఇంటింటా హారతులు పట్టిన మహిళలు
- హాజరైన ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు


నెల్లిమర్ల రూరల్: పెదతరిమిలో లబ్ధిదారులకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, తదితరులు

నెల్లిమర్ల రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి భవిష్యత్‌తరాలకు భరోసాగా నిలబడుతున్నారని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని వల్లూరు, పెదతరిమి, బొడ్డపేట గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు ప్రభుత్వ పాలనపై ఆరా తీశారు. జగనన్న పాలనపై ప్రజలందరూ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మాట్లాడుతూ, భావితరాలకు భరోసాగా జగనన్న ఉన్నారనే ధైర్యాన్ని కల్పించే దిశగా ఈ కార్యక్రమం కొనసాగుతోందన్నారు. గత పాలనలో బడుగు బలహీన వర్గాలు అట్టడుగు స్థాయిలో ఉండేవన్నారు. అటువంటి వారి జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత ముఖ్యమంత్రి జగనన్నకే దక్కుతుందని చెప్పారు. ప్రజలకు జరిగిన మంచితో ఇంటింటా అపూర్వ స్వాగతం లభిస్తోందని, సంక్షేమ రాష్ట్రంగా నిలబెట్టేందుకు పాటుపడుతున్న జగన్ మోహన్‌రెడ్డికి మరోసారి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు.

అవినీతిరహిత పాలన..

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అవినీతిరహిత పరిపాలన అందిస్తోందని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. గతంలో సంక్షేమ పథకాలు వర్తించాలంటే కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగేవారని, జన్మభూమి కమిటీలకు లంచం ఇస్తే కాని పని జరిగేది కాదని గుర్తు చేశారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రస్తుతం నేరుగా ఇంటివద్దకే పథకాలు అందిస్తున్న ఘనత జగనన్నకు దక్కుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సభ్యుడు అంబళ్ల శ్రీరాములనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చనమల్లు వెంకటరమణ, ఎంపీడీఓ గిరిబాల, ఈఓపీఆర్‌డీ భానోజీరావు, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పంచాది శ్రీరాములనాయుడు, కంది శ్రీనివాసరావు, కంది రామునాయుడు, పైడి అప్పన్న, సువ్వాడ రమేష్‌నాయుడు, పంచాది సూర్యకాంత, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమ పాలన : డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి


గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు శ్రావణి, లయాయాదవ్

విజయనగరం: వైఎస్సార్‌సీపీ హయాంలోనే ప్రజలకు సంక్షేమ పాలన అందుతోందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల శ్రావణి అన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారని చెప్పారు. నగరంలోని 29వ సచివాలయం బూర్లిపేట పరిసర ప్రాంతాల్లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రావణి, మరో డిప్యూటీ మేయర్ ముచ్చు లయాయాదవ్, ఏఎంసీ చైర్‌పర్సన్ నడిపేన శశిభార్గవి, తదితరులతో కలిసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. అలాగే స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పనితీరు పట్ల ప్రజల స్పందన చూస్తే.. తమకు మరింత రెట్టింపు ఉత్సాహం కలుగుతోందని చెప్పారు. సమస్యలను వెంటనే తెలుసుకుని పరిష్కరించడానికి ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. స్థానిక శాసనసభ్యుడు కోలగట్ల వీరభద్రస్వామి నిరంతరం ప్రజల మధ్యనే ఉంటూ.. నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పిల్లా రాధాభవాని, డివిజన్ నాయకులు పిల్లా క్రాంతి, తదితరులు పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలి..


అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన మహిళల నిరసన

విజయనగరం పూల్‌బాగ్: మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించి అత్యంత క్రూరంగా అత్యాచారానికి పాల్పడిన మతోన్మాద మృగాలను ఉరి తీయాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా గౌరవాధ్యక్షురాలు మద్ది మాణిక్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత పావని, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. నాగభూషణం డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ), అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో అంబేడ్కర్ జంక్షన్లో సోమవారం నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మణిపూర్‌లో కుకీ తెగకు చెందిన ఆదివాసీ మహిళలను పట్టపగలు అత్యంత దుర్మార్గంగా నగ్నంగా ఊరేగించడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ చాంద్‌బీబ, జిల్లా అధ్యక్షురాలు బాయి రమణమ్మ, జిల్లా ఉపాధ్యక్షురాలు ఉంగరాల జయలక్ష్మి, గౌరి, ఖాదర్ బీబీ, ఎల్. శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

దాడులు దుర్మార్గం

నెల్లిమర్ల రూరల్: మణిపూర్‌లో ఆదివాసీ మహిళలపై హత్యాచార దాడులు జరగడం బాధాకరమని సీపీఐ మండల కార్యదర్శి మొయిద పాపారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మండలంలోని కొండగుంపాంలో నిరసన వ్యక్తం చేశారు. పొట్నూరు సూర్యారావు, లెంక రాజినాయుడు, పతివాడ సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

31న చలో కలెక్టరేట్

విజయనగరం పూల్‌బాగ్: మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు నెలకు రూ.10 వేలు ఇవ్వాలని సీఐటీయూ నగర అధ్యక్షుడు ఎ. జగన్ మోహనరావు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక వీటీ అగ్రహారం, దుప్పాడ, జొన్నవలస, రాకోడు, పెనవేమాలి, కోరుకొండపాలెం, కోరుకొండ, కొత్తూరు, గుండాలపేట, సారిక, మజ్జిపేట స్కూల్లో కార్మికులను కలిసి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో అచ్చియమ్మ, పార్వతి, రమణమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.